# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమైంది.
- మొంథా తుఫాను ప్రభావంతో అపార నష్టం వాటిల్లిన రాష్ట్రాన్ని ఆదుకోవాలని ప్రభుత్వం కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేసింది.
- అమరావతి - విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.
- ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాష్ట్రంలో కొన్ని చోట్ల రేపు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

===================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అమరావతిలోని సచివాలయంలో ఈరోజు జరిగింది. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు వివరించారు. రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యంగా దాదాపు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చే విధంగా వివిధ ప్రతిపాదనలకు ఈ సమావేశంలో ఆమోదం లభించిందని మంత్రి తెలిపారు. వివిధ సంస్థలకు భూ కేటాయింపులకు సంబంధించి సీఆర్డీఏ నిర్ణయాలు, పరిశ్రమల ఏర్పాటులో భూముల కేటాయింపుకు రాయితీలు, రెవెన్యూ శాఖలో పోస్టుల భర్తీ, అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యవస్థ ఏర్పాటు, మొదలైన పలు కీలక అంశాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి వెల్లడించారు. పేదలందరికీ ఇళ్ళు అందించే బాధ్యతను మంత్రులు, ప్రజా ప్రతినిధులు తీసుకోవాలని, అర్హులైన వారి జాబితా రూపొందించి అందరికీ సొంత ఇళ్ళు లభించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి సూచించారని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

===================

మొంథా తుపాను ప్రభావంతో అపార నష్టం వాటిల్లిన రాష్ట్రాన్ని ఆదుకోవాలని ప్రభుత్వం కేంద్ర బృందాన్ని కోరింది. మొంథా తుపానుతో జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి ఏర్పాటైన కేంద్ర బృందం ఈరోజు అమరావతిలోని సచివాలయానికి వచ్చింది. కేంద్ర హోం శాఖ జాయింట్ సెక్రటరీ పాసుమీబసు, కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ కె. పొన్నుస్వామిల నేతృత్వంలోని 8 మంది సభ్యుల కేంద్ర బృందానికి ఆర్టీజీఎస్ అధికారులు స్వాగతం పలికి, అనంతరం తుఫాను వల్ల జరిగిన నష్టం వివరాలను తెలియజేశారు. మొంథా తుపాను వల్ల 6,384 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని, 901.4 కోట్ల రూపాయల తక్షణ సహాయం అందించి ఆదుకోవాలని కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖ చీఫ్ కమిషనర్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్‌లు తుఫాను ప్రభావాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి, రాష్ట్రంలోని 24 జిల్లాల్లో తుఫాను విధ్వంసం సృష్టించిందని తెలిపారు. విపత్తు కలిగించిన విధ్వంసం నుంచి బాధితులు కోలుకోవడానికి కేంద్రం ఉదారంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

===================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి-విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపై సచివాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, పలు ఇతర శాఖల ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ రాష్ట్రానికి గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దే అంశంపై సమావేశంలో చర్చించారు. శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకూ వివిధ జిల్లాల్లో ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడులు, జీవన ప్రమాణాలు, సుస్థిరాభివృద్ధి తదితర అంశాలతో ఎకనామిక్ మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై సమావేశంలో చర్చించారు.

===================

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రేపు గుంటూరు నగరంలో పర్యటించనున్నారు. నగర పరిధిలోని పెంగళాయపాలెంలో ఆధునికీకరించిన చెరువును ప్రారంభించి, అనంతరం నల్లపాడులోని లయోలా కళాశాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్రమంత్రి పాల్గొంటారు. అక్కడ వాటర్ షెడ్ మహోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం జనభగీరథ్ కప్ విజేతలకు పురస్కారాలను ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు పాల్గొనున్నారు.

===================

దేవాలయాల్లో తొక్కిసలాట ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం వాటిని నివారించేందుకు చర్యలు చేపట్టింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకునేందుకు ముగ్గురు మంత్రులతో కూడిన ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ లను ఈ ఉప సంఘంలో సభ్యులుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

విరామం

===================

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్.. దేశం గర్వించదగ్గ మహనీయుడని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ అన్నారు. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 12వ తేదీన విశాఖలో నిర్వహించనున్న యూనిటీ మార్చ్ వివరాలను ఆయన ఈరోజు పత్రికా సమావేశంలో వెల్లడించారు. దేశ వ్యాప్తంగా మతాలు, భాషలు వేరుగా ఉన్నా.. అందరూ ఐక్యమత్యంగా ఉండాలన్న సర్దార్ పటేల్ సందేశానికి మద్దతుగా యూనిటీ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల అంశాన్ని ప్రస్తావిస్తూ... 9.8 లక్షల కోట్ల రూపాయల విలువైన ఒప్పందాలు చేసుకునే విధంగా ఈ నెల 14వ తేదీన విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు.

విశాఖ నగరానికి ఐటి రంగంలో భారీ పెట్టుబడులు వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సదస్సు కోసం నగరంలో సుందరీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఎంపి వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

==================

మొంథా తుఫాను నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర బృందం ఈ రోజు కృష్ణా జిల్లాలో పర్యటించింది. గన్నవరం ఎంపీడీవో కార్యాలయంలో తుఫాను నష్టాలపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ఆ బృందం తిలకించింది. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.. తుఫాను వల్ల జరిగిన నష్టం వివరాలను కేంద్ర బృందానికి వివరించారు. దెబ్బతిన్న పంటలు, ఉద్యాన తోటలు, ఇళ్ళు, రహదారులు, విద్యుత్ స్తంభాలు, మరణించిన పశువులు, మునిసిపల్, పంచాయతీ రాజ్ శాఖలకు జరిగిన నష్టాలు మొదలైన ఛాయాచిత్రాలను కేంద్ర వ్యవసాయం రైతుల సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ కే. పొన్నుస్వామి నేతృత్వంలోని కేంద్ర బృందం పరిశీలించింది.

==================

అరకు చలి ఉత్సవాలను వచ్చే జనవరిలో నిర్వహించనున్నామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ తెలిపారు. ఉత్సవాల కార్యాచరణపై ఆయన ఈరోజు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులకు ఉత్సవాలకు సంబంధించిన కీలక బాధ్యతలను అప్పగించారు. ఉత్సవాలలో భాగంగా జరిగే సాంస్కృతిక కార్యక్రమాల కోసం దేశం నలుమూలల నుండి కళాకారులను ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని వివిధ ఐటీడీఏల నుంచి స్టాల్స్ ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. సైక్లింగ్ కోసం గ్రామీణ రహదారులను కలుపుతూ.. పర్యాటక గమ్యస్థానాలు ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు హాజరయ్యే పర్యాటకుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

==================

తెలుగు భాషా పరిరక్షణకు సుస్థిరమైన మార్గం చూపిన మహనీయుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అని అల్లూరు సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ అన్నారు. సి.పి. బ్రౌన్ 227వ జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ  శాఖ అధికారి కె. పద్మలత, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఎల్. లక్ష్మీ ప్రసాద్ లతో కలసి కలెక్టర్ సి.పి. బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతృభాష తెలుగును ఎవ్వరూ మరువకూడదని అన్నారు. అందరూ తెలుగులోనే సంతకాలు చేయాలని సూచించారు. సి.పి. బ్రౌన్.. ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారిగా పని చేస్తూనే.. తెలుగు భాషకు ఎనలేని సేవ చేశారన్నారు.

==================

ఉత్తర తమిళనాడు, దాని పరిసర ప్రాంతాలలో నిన్న ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో  విస్తరించి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ లోని దిగువ ట్రోపో ఆవరణంలో ఉత్తర, ఈశాన్య గాలులు వీస్తున్నాయని, ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రలో రేపు ఒకటి రెండు చోట్ల తేలిక పాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొంటూ...

(వాయిస్ 18 సెకన్లు)

==================
==================